సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



పోరాటం ఆగదు

కూటమి ప్రభుత్వం దిగి వచ్చి గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించి, ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం ఆగదని ఆందోళనకారులు స్పష్టం చేశారు. - 8లో



నాటి మాటలు.. నీటిమీద రాతలేనా..? - 8లో

సాలూరు మండలంలోని ఏజెన్సీలో ప్రభుత్వ పాఠశాలలు పాకల్లో నడుస్తున్నాయి.

కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో రాష్ట్రీయ కిశోర స్వాస్థ కార్యక్రమంలో భాగంగా ఖాళీగా ఉన్న కౌన్సిలర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ కె.రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు విజయనగరం.ఎన్ఐసీ.ఇన్‌లో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు న్యాయ అవగాహన సదస్సు

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేసి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రకటనలో కోరారు.

కుందరతిరువాడలో ఏనుగులు



కేటీవాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని కుందరతిరువాడ పరిసర ప్రాంతాలలో సోమవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. వరిధాన్యం కళ్లాల్లో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే అరటిపంట కోతదశలో ఉందని, చెరకు, పామాయిల్ పంటలు ఉండడంతో పంటలను ధ్వంసం చేస్తాయని వాపోతున్నారు. మూడు రోజుల నుంచి ఏనుగులు ఇక్కడే ఉండడంతో రాత్రిపూట పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏనుగులను తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

మరింత చేరువగా 'సంకల్పం'



సంకల్ప ప్రచార రథంను వీక్షిస్తున్న యువత, విద్యార్థులు

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీస్‌శాఖ చేపట్టిన 'సంకల్పం' కార్యక్రమాన్ని ప్రచార రథంతో ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఒక కూడలిలో వాహనాన్ని నిలిపి, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తున్నట్టు చెప్పారు. తోటపాలెం కళాశాల వద్ద వాహనాన్ని నిలిపి, మాదక ద్రవ్యాల వల్ల కుటుంబాలు ఏ విధంగా ఛిద్రమవుతున్నాయో తెలియజేసేలా ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను సోమవారం ప్రదర్శించారు. వీటిని యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తిలకించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్ఐలు ప్రసన్నకుమార్, కిరణ్‌కుమార్‌నాయుడు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పోస్టుల భర్తీకి 12న ఇంటర్వ్యూలు

వేపాడ: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు/కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను పార్ట్‌టైమ్ ప్రాతిపదికన భర్తీ చేస్తామని జిల్లా సమన్వయకర్త టి.ఎమ్.ఫ్లారెన్స్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 12న ఉదయం 11 గంటలకు నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో డెమోకమ్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. వేపాడ, వియ్యంపేట, నెల్లిమర్ల గురుకులాల్లో గణిత సబ్జెక్టు, భామినిలో ఫిజికల్ సైన్స్, బయోసైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులకు మహిళా అభ్యర్థులు, నెల్లిమర్లలో సివిక్స్, కొప్పెర్లలో బోటనీ పోస్టుకు పురుష అభ్యర్థులను నియమిస్తామన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలని, మెథడాలజీతో బీఎడ్, సంబంధిత సబ్జెక్టులో టెట్ పేపరు-2లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, లేదా విజయనగరం ఆర్అండ్‌బీ కూడలి వద్ద సమన్వయకర్త వారి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

త్వరలో అన్నదాత సుఖీభవ అమలు

- మంత్రి అచ్చెన్నాయుడు

పార్వతీపురం: త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20వేలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం నిర్వహించిన డీఆర్సీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడచిన ఆరు నెలల్లో ఎవరూ ఊహించని విధంగా ప్రభుత్వాన్ని గాడిలో పెట్టినట్టు వెల్లడించారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సేద్యం చేసేందుకు రూ.145కోట్లతో యంత్ర పరికరాలను సమకూర్చినట్టు తెలిపారు.



మాటమీద నిలబడేలా..
ప్రభుత్వాన్ని నిలదీద్దాం

- పింఛన్ల పెంపు తప్ప ఎన్నికల హామీలన్నీ తుస్
- గత ప్రభుత్వంపై బురద చల్లడం ఒక్కటే పని
- మోసపోయిన ప్రజలకు బాసటగా నిలవాలి
- మనమూ నిలబడకపోతే ప్రజలకు తీవ్ర నష్టం
- రైతుల కోసం 13న కలెక్టర్లకు వినతిపత్రం
- విద్యుత్ చార్జీలు తగ్గించాలని 27న నిరసన
- విద్యార్థుల ఫీజుల కోసం జనవరి 3న పోరు
- శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న శాసన మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ, చిత్రంలో ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

'మాట మీద నిలబడటం, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం టీడీపీ నాయకులు ఇంటావంటా లేదు. వారి తీరే అంతేనని మనమూ ఊరుకోకూడదు. టీడీపీ కూటమి ప్రభుత్వంతో మోసపోయిన ప్రజలకు బాసటగా నిలవాలి. ఇప్పుడీ పరిస్థితుల్లో మనమూ నిలబడకపోతే ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుంది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ తీరు మారాలని కోరుతూ ఈనెల 13న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లకు వైఎస్సార్‌సీపీ నాయకులంతా వెళ్లి వినతిపత్రం ఇద్దాం. ఆరునెలల కాలంలోనే రెండుసార్లు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ 27వ తేదీన విద్యుత్‌శాఖ ఎస్ఈలకు మెమోరాండం సమర్పిద్దాం. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలన్న డిమాండ్‌తో జనవరి 3న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం ఇద్దాం. మాటమీద నిలబడాలని కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామ'ని మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

టీడీపీ కూటమి ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో నష్టపోతున్న ప్రజలకు బాసటగా నిలవాలన్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల పార్టీ సమావేశంలో పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు దఫదఫాలుగా నిరసన కార్యక్రమాల సన్నద్ధతలో భాగంగా సోమవారం సాయంత్రం పార్టీ సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ నేతృత్వంలో విజయనగరంలోని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకటచిన్న అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, విశ్వాసరాయి కళావతి, అలజంగి జోగారావు, శోభా హైమావతి, విజయనగరం మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, పార్టీ నాయకులు నెక్కల నాయుడుబాబు, వేచలపు చినరామునాయుడు, కేవీ సూర్యనారాయణరాజు, గుల్లిపల్లి గణేష్, నారాయణమూర్తిరాజు తదితరులు హాజరయ్యారు.

రైతులకు బాసటగా...

పార్టీ నాయకులతో సమావేశం అనంతరం బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం నిర్ణయం ప్రకారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో శాంతియుత నిరస న కార్యక్రమాలు చేపట్టేందుకు సన్నద్ధత నిమిత్తం ఇరు జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించామని చెప్పారు. ఇటీవల తుపానులు, అకాల వర్షాలతో ధాన్యం తడిచిపోయాయన్నారు. ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వ విధానం సరిగా లేకపోవడం వల్ల రైతులకు చాలా ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. కనీస మద్దతు ధర కన్నా రెండు మూడొందలు తక్కువకే అమ్ముకోవాల్సి పరిస్థితి ఏర్పడిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద ఇచ్చిన రూ.13,500 పెట్టుబడి సాయాన్ని రూ.20 వేలకు పెంచి ఇస్తామని ఎన్నికల్లో టీడీపీ నాయకులు చెప్పారు. ఆ డబ్బులు కూడా ఇప్పటివరకూ ఇవ్వలేదన్నారు. పంటల బీమా ప్రీమియం కూడా గత ప్రభుత్వం చెల్లించేదని, ఇప్పుడు రైతులే చెల్లించుకోవాలని కూటమి ప్రభుత్వం చెబుతోందని వెల్లడించారు. ఆర్థిక వెసులుబాటులేని రైతులు ఆ ప్రీమియం చెల్లించకపోతే ప్రకృతి విపత్తులతో నష్టపోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ధాన్యం సక్రమంగా ప్రభుత్వమే కొనుగోలుచేయాలని, పెట్టుబడి సాయం అందించాలని, పంటల బీమా ప్రీమియం చెల్లించాలనే డిమాండ్లతో ఈనెల 13న ఇరు జిల్లాల్లోనూ కలెక్టర్లకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు న్యాయం కోసం...

ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో వ్యవహరించేదని, ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఆఖరు త్రైమాసికం ఫీజును ముందుగానే చెల్లించేదని బొత్స గుర్తు చేశారు. ఆ మాదిరిగానే ఎన్నికలకు ముందు కూడా చెల్లించడానికి సిద్ధమైతే టీడీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేసి అడ్డుకున్నారని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాతైనా కూటమి ప్రభుత్వం ఆ బకాయిలను చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కాలేజీల నుంచి సర్టిఫికెట్లు పొందడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పరీక్షలకు కూడా కూర్చోనివ్వట్లేదన్నారు. ఆ ఫీజు బకాయిలు చెల్లించాలనే డిమాండుతో జనవరి 3న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం ఇస్తామని బొత్స వెల్లడించారు.

విద్యుత్ చార్జీలు పెంచొద్దని...

ప్రజలపై విద్యుత్‌చార్జీల భారం మోపబోమని, అవసరమైతే తగ్గిస్తామని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే రెండుసార్లు పెంచారని బొత్స ఆవేదన వ్యక్తం చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రతినెలా రూ.1.20 వరకూ పెంచుకోవడానికి అవకాశం ఇచ్చిందని, ఇది చాలా అభ్యంతరకరమని అన్నారు. వినియోగదారులపై భారం మోపడం అన్యాయమన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 27వ తేదీన ఇరు జిల్లాల్లోనూ విద్యుత్‌శాఖ కార్యాలయాలకు వెళ్లి ఎస్ఈలకు వినతిపత్రం సమర్పిస్తామని చెప్పారు. ప్రజలపై భారం మోపకుండా రూ.15వేల కోట్ల మేరకు ప్రభుత్వమే డిస్కమ్‌లకు సబ్సిడీగా ఇవ్వాలని డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరతామన్నారు.

డ్రైవర్ సజీవ దహనం

- ఇసుక లారీని వెనుక నుంచి ఢీకొన్న వ్యాన్
- వ్యాన్‌లో మంటలు చెలరేగడంతో ప్రమాదం
- నారుపేట సమీపంలో రోడ్డు ప్రమాదం



మంటల్లో ఆహుతి అవుతున్న వ్యాన్



మంటల్లో చిక్కుకుని సజీవ దహనం అయిన డ్రైవర్

పూసపాటిరేగ: భోగాపురం మండలం నారుపేట సమీపంలో సోమవారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ఇసుక లారీని వ్యాన్ వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో అయిల్‌ట్యాంకర్ పేలి వ్యాన్‌లో మంటలు చెలరేగాయి. వ్యాన్ క్యాబిన్‌లో చిక్కుకున్న రెండవ డ్రైవర్(క్లీనర్) కాళ్లు ఇంజన్‌లో చిక్కుకుపోవడంతో మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...

ఒడిశా నుంచి మహారాష్ట్రలోని సోలాపూర్ వెళ్తున్న వ్యాన్ భోగాపురం మండలం నారుపేట సమీపంలో జాతీయరహదారిపై ముందు వెళ్తున్న ఇసుక లారీని బలంగా వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో వ్యాన్ ఆయిల్ ట్యాంకర్ పేలి ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి తప్పించుకోగా, వ్యాన్‌లో ఉన్న మరో డ్రైవర్ (క్లీనర్) షేక్ అరీఫ్ కాళ్లు ఇంజిన్‌లో చిక్కుకు పోవడంతో ప్రమాదం నుంచి బయటపడలేకపోయాడు. రక్షించండంటూ హాహాకారాలు పెట్టినా ఎవరూ దగ్గరకు వెళ్లలేకపోయారు. మంటలను అదుపుచేయలేకపోవడంతో అందరూ చూస్తుండగానే సజీవదహనమయ్యాడు. పోలీసులు సమాచారం ఇచ్చిన వెంటనే అగ్నిమాపక యంత్రం వస్తే డ్రైవర్ ప్రాణాలు నిలిచేవని స్థానికులు తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. భోగాపురం ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయపెడుతున్న ప్రమాదాలు

భోగాపురం నుంచి రాజాపులోవ మధ్య వరుసగా ప్రమాదాలు జరగడంతో వాహన చోదకులు హడలిపోతున్నారు. గతవారం రోజుల కింద అక్కడకు కొద్ది దూరంలో కారు బోల్తా కొట్టడంతో శ్రీకాకుళం పట్టణానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. ఇది మరువకముందే రోడ్డు ప్రమాదంలో అందరూ చూస్తుండగానే డ్రైవర్ మంటల్లో చిక్కుకొని సజీవ దహనం కావడం స్థానికులను భయాందోళనకు గురిచేసింది. అగ్నిమాపక స్టేషన్ పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో ఏర్పాటు చేస్తామన్న అధికారుల మాటలు నీటి మూటలుగానే మిగిలాయని, ప్రమాదాల సమయంలో ఆదుకునే వారే కరువయ్యారని స్థానికులు నిట్టూర్చుతున్నారు.

పింఛన్‌దారుల అర్హతలపై ఆరా



వృద్ధురాలిని విచారణ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, విచారణ అధికారులు

పూసపాటిరేగ: సామాజిక పింఛన్లలో అనర్హుల ఏరివేతకు రంగం సిద్ధమైంది. మండలంలోని వెల్దూరు సచివాలయంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో 11 బృందాలు 437 మంది పింఛన్‌దారుల అర్హతలపై విచారణ చేశారు. ప్రభుత్వం రూపొందించిన ప్రశ్నావళితో ఇంటింటికీ వెళ్లి విచారణ జరిపారు. పింఛన్‌దారుడి వయస్సు, విద్యుత్ వినియోగం 300 యూనిట్లు లోపల ఉందా? లేదా?, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉన్నారా?, ఇంట్లో ఎవరికైనా ప్రభుత్వ ఉద్యోగం ఉందా?, ఇంటి విస్తీర్ణం, వితంతు పింఛన్‌దారులకు భర్త డెత్ సర్టిఫికెట్, ఒంటరి మహిళలకు తహసీల్దార్ జారీ చేసిన పత్రం తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేకయాప్‌లో అర్హతలు నమోదుచేస్తున్నారు. వెల్దూరు పంచాయతీ పరిధిలోని కిలుగుపేట, బూరపేట, కాలపురెడ్డి పేట, నడిపల్లి, చిననడిపల్లి గ్రామాల్లో పింఛన్‌దారుల అర్హతలపై ఆరా తీశారు. కార్యక్రమంలో నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ ఎంపీడీఓలు కె.రామకృష్ణరాజు, ఎం.వి.కామేశ్వరరావు, ఎం.రాధిక, వై.భవానీతో పాటు వెలుగు ఏపీఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మరో సమరం..!

- నీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఈనెల 11న నోటిఫికేషన్
- 14న ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు
- రైతు భరోసా ఇవ్వక విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం
- ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్న రైతులు
- బరిలోకి దిగుతున్న వైఎస్సార్‌సీపీ





పాలకొండలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ (ఫైల్)

వీరఘట్టం/పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా సాగునీటి వినియోగదారు సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గత నెల 21న జరగాల్సిన ఈ ఎన్నికలు ఈనెల 8వ తేదీకి వాయిదా పడడంతో ఆశావహులు ఆ పదవులు దక్కించుకునేందుకు ఎమ్మెల్యేలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సుమారు పదేళ్ల తర్వాత ఈ ఎన్నికలు జరుతుండడంతో తమ అనుయాయులను గెలిపించేందుకు కూటమి నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల సంభవించిన తుఫాన్ కారణంగా మరోసారి ఈ ఎన్నికలను ఈనెల 14వ తేదీకి వాయిదా వేశారు.

ఈనెల 11న నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి 14న ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కూటమి ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. రైతు భరోసా రూ.20 వేలు ఇస్తామని చెప్పిన మాట తప్పింది. ఈ ఖరీఫ్‌లో కనీసం పెట్టుబడి సాయం కూడా రైతులకు కూటమి ప్రభుత్వం ఇవ్వలేదు. అంతేకాకుండా, ఎరువులు, పురుగు మందుల ధరలు అమాంతం పెంచేసి ఖరీఫ్‌లో రైతులను నానా అవస్థలకు గురిచేసింది. అంతేకాకుండా ప్రస్తుతం జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో కూడా తీవ్ర జాప్యం చేస్తూ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని రైతులు బహిరంగంగానే కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. మరికొద్ది రోజుల్లో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు రైతన్నలు సిద్ధంగా ఉన్నారు.

పాలకొండలో ఎన్నికల వేడి..

నీటి సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావడంతో కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓటును సద్వినియోగం చేసుకునేందుకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులతో సమావేశాలు నిర్వహించి నీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనాలని దిశానిర్దేశం చేశారు. తాజాగా కూటమి నాయకులు కూడా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇటీవల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నీటి సంఘాల పదవుల కోసం పోటీ పడుతున్న ఆశావహులతో సంప్రదింపులు చేశారు. దీంతో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల వేడి పాలకొండలో రసవత్తరంగా మారిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మన్యం జిల్లాలో 213 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.జిల్లాలో ముఖ్యంగా తోటపల్లి జలాశయం పెద్ద తరహా నీటిపారుదల ప్రాజెక్ట్ పరిధిలోకి వస్తుంది. తోటపల్లి జలాశయం పరిధిలో 25 నీటి వినియోగదారుల సంఘాలు, 5 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 1 ప్రాజెక్ట్ కమిటీ ఉన్నాయి. మధ్య తరహా ప్రాజెక్టుల కింద 6 నీటి వినియోగదారుల సంఘాలు, 4 ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. అలాగే 176 చిన్న తరహా నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. ఈ మొత్తం సంఘాల పరిధిలో 1,560 ప్రాదేశికాలు ఉండగా వాటి పరిధిలో సుమారు 2.50 లక్షల మంది రైతులు ఓటు హక్కు కలిగి ఉన్నారు. వారిని ఏకతాటిపైకి తెచ్చి ప్రత్యక్ష పద్ధతి (చేతులెత్తే పద్ధతి)లో నీటి సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకు సంబంధించి ఈనెల 11న నీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి 14న ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ కుర్చీకోసం తీవ్ర పోటీ..

జిల్లాలో 213 నీటి సంఘాలు ఉండగా అందులో తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కుర్చీ కోసం మాత్రం తీవ్ర పోటీ ఉంది. తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఒక ప్రత్యేక హోదాను తీసుకువస్తుంది. దీంతో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి కోసం నాయకుల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది.తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని 64 వేల ఎకరాల పాత ఆయకట్టులో గరుగుబిల్లి, వంగర, జియ్యమ్మవలస, వీరఘట్టం, పాలకొండ మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 42 వేల మంది రైతులకు సంబంధించి 25 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి.

తోటపల్లికి మూడవ చైర్మన్ ఎవరో..!

ఇప్పటి తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి గడిచిన 20 ఏళ్లలో వీరఘట్టం మండలానికి చెందిన దమలపాటి వెంకటరమణనాయుడు, నిమ్మక పాండురంగలు చైర్మన్లుగా పనిచేశారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్మన్ పాలవలస రాజశేఖరం చలవతో ప్రస్తుత వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడికి తొలిసారి తోటపల్లి చైర్మన్ పదవి దక్కింది. అలాగే 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో కార్మికశాఖ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు చొరవతో అప్పటి పాలకొండ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ప్రస్తుత జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ చక్రం తిప్పి తన సోదరుడు నిమ్మక పాండురంగకు తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి దక్కేలా చేశారు. ప్రస్తుతం మూడవసారి పోటీ తీవ్రంగా ఉండడంతో తోటపల్లి ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

తల్లిదండ్రులు మెచ్చిన నాడు-నేడు పనులు

- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'మా బడి నాడు-నేడు' కార్యక్రమంతో పాఠశాలలను ఎంత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినదీ తాము ప్రత్యేకంగా చెప్పుకోనక్కర్లేదని, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు పేరెంట్ టీచర్స్ సమావేశాలతో సచిత్రంగా చూపిస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలను చూసి మెచ్చుకుంటున్నారని, అందుకు తామే చంద్రబాబుకు థాంక్స్ చెప్పాలని విద్యాశాఖ మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. విజయనగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఇంటి వద్ద మీడియాతో మాట్లాడారు. హనీమూన్ పిరియడ్‌గా సంక్రాంతి వరకూ టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని పట్టించుకోకూడదనుకున్నా ప్రస్తుత పరిస్థితుల్లో దగాపడుతున్న ప్రజలను చూసి ఉద్యమాలు చేయాల్సి వస్తోందన్నారు. గత చంద్రబాబు పాలనలో స్కూళ్లు ఎలా ఉండేవో, తర్వాత తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలా ఉన్నాయో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా స్వయంగా వెళ్లి కూర్చొని తెలుసుకున్నారని బొత్స గుర్తు చేశారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019-24 మధ్యకాలంలో డిస్కమ్‌లకు మద్దతుగా సుమారు రూ.45,800 కోట్లు చెల్లించిందని, అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం 2014-19 కాలంలో ఇచ్చినది కేవలం రూ.15,300 కోట్లు మాత్రమేనని బొత్స సత్యనారాయణ అన్నారు. తమకు సంపద ఎలా సృష్టించాలో తెలుసంటూ అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆరునెలలవుతున్నా రాష్ట్రాభివృద్ధిపై దృష్టిపెట్టకుండా రామనామం మాదిరిగా రోజూ జగన్ జపం చేస్తున్నారని బొత్స ఎద్దేవా చేశారు. భూదందాల వెనుక వైఎస్సార్‌సీపీ వారు ఉన్నారంటూ రోజూ పత్రికల్లో రాయించడం సిగ్గుచేటని, చేతిలో అధికారం ఉన్నప్పుడు విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవచ్చు కదా? అని ప్రశ్నించారు. అది చేయకుండా చేతగాని ప్రభుత్వమని ఒప్పుకుంటున్నారా? చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. ఈ విధానాలపై ఒకటీ రెండు రోజుల్లో ప్రభుత్వానికి మరో లేఖ రాస్తానని చెప్పారు.

క్లుప్తంగా

డీలర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ

పాలకొండ: రేషన్ డీలర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని సబ్‌కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న 21 రేషన్ డీలర్ పోస్టులకు గాను శాశ్వత ప్రాతిపదికన డీలర్లను నియమించనున్నట్లు పేర్కొన్నారు. భామిని మండలంలో 5, జియ్యమ్మవలస మండలంలో 3, కురుపాం మండలంలో 1, పాలకొండ మండలంలో 5, వీరఘట్టం మండలంలో 7, పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హత గల వారు సంబంధిత తహసీల్దార్ కార్యాలయం, సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత చౌకధరల దుకాణం పరిధిలో ఉండాలని, ఇంటర్‌మీడియట్ విద్యార్హత ఉండాలని, 18ఏళ్ల నుంచి 40ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని స్పష్టం చేశారు. అర్హత గల డ్వాక్రా గ్రూపులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

140 సారా ప్యాకెట్ల పట్టివేత

సాలూరు: పాచిపెంట మండలంలోని గోకడవలస వద్ద ఓ వ్యక్తి దగ్గర 140 సారా ప్యాకెట్లు పట్టుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ జి.దాసు తెలిపారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అక్రమంగా బెల్ట్ షాప్‌ల నిర్వహణ, సారా విక్రయం, తరలింపుపై ఉక్కుపాదం మోపుతున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఈ తనిఖీలు, దాడులు మరింత ముమ్మరం చేస్తామని, చట్టాలను ఉల్లంఘించిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మక్కువలో 200 సారా ప్యాకెట్లు

మక్కువ: మండలంలోని మేలాపువలస జంక్షన్ సమీపంలో కన్నంపేట గ్రామానికి చెందిన ఓవ్యక్తి తరలిస్తున్న 200 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఒడిశా నుంచి సారా ప్యాకెట్లను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, మాటుకాసి నిందితుడిని అదుపులోకి తీసు తీసుకున్నామని తెలిపారు. సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం సాలూరు జ్యుడీషియల్ కోర్టుకు తరలించినట్లు హెచ్‌సీ తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పీలుస్తున్న ముగ్గురి అరెస్ట్



పట్టుబడిన నిందితులు

నెల్లిమర్ల: పట్టణంలోని డైట్ కాలనీ పరిధిలో గంజాయి పీలుస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల గోడ వెనుక బహిరంగ ప్రదేశంలో గంజాయి పీలుస్తున్న ముగ్గురిని పోలీసులు గుర్తించారు. అనంతరం ఎస్సై బి.గణేశ్ సిబ్బందితో కలిసి రైడ్ చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడంతో పాటు, వారి దగ్గర లభ్యమైన 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. డైట్ కాలనీకి చెందిన ఒక వ్యక్తి, ఊటగెడ్డకు చెందిన మరో వ్యక్తి, కోరాడపేటకు చెందిన ఇంకో వ్యక్తి స్నేహితులని, వారు గంజాయి వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

రెండు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్ట్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెం సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద ముగ్గురు అనుమానిత వ్యక్తులను పట్టుకుని తనిఖీ చేయగా వారి దగ్గర సుమారు రెండు కిలోల గంజాయి లభించిందని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. కంటోన్మెంట్ వద్దనున్న బొగ్గులదిబ్బ ప్రాంతంలో నివసించే జ్యోతిప్రసాద్, విశాఖ జిల్లా పద్మనాభం మండలం పొట్నూరులో నివసించే ఆబోతుల భోగేశ్వర్‌లు ఒడిశా రాష్ట్రంలోని జగత్‌సింగ్ పూర్ నుంచి విజయనగరం వచ్చి షేక్ ఇంతియాజ్ అలీకి సుమారు రెండు కిలోల గంజాయిని అమ్ముతుండగా పక్కా సమాచారంతో వారిని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్, ఎస్సై రామగణేష్‌లు వారిని అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వివరించారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210

ప్రభుత్వం దిగివచ్చే వరకు.. పోరాటం ఆగదు

- అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల స్పష్టీకరణ
- పోలీసులు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం
- కలెక్టరేట్ ముఖద్వారం వద్ద బైఠాయింపు



ఆందోళన చేస్తున్న గిరిజన అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

పార్వతీపురంటౌన్/పార్వతీపురం: కూటమి ప్రభుత్వం దిగి వచ్చి గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించి, ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం ఆగదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం ఆయన ఔట్‌సోర్సింగ్, ఉపాధ్యాయులతో కలిసి బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు ఐటీడీఏ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జాబు కావాలంటే బాబు రావాలి అన్నవారి పాలనలో గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల జాబులు పోయే పరిస్థితి కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి పోస్టులు మినహాయించి డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన గిరిజనులు

చేశారు. కలెక్టరేట్‌లో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెంనాయుడికి సమస్యను వివరించేందుకు వెళ్లిన ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్దే ఆందోళన చేస్తూ బైఠాయించారు.

ఇన్‌చార్జి మంత్రికి వినతిపత్రం

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కింజరాపు అచ్చెంనాయుడికి గిరిజన అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించి ఉద్యోగభద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి దృష్టికి సమస్య తీసుకు వెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, శోభారాణి, యమున, గున్నమ్మ, ఉమారాణి, కల్యాణి, జ్యోతి, రాజేష్, దివాకర్, వెంకట్, తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలి

గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాలను మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు మూడడ్ల కృష్ణమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. సాగు చేస్తున్న భూములకు సంబంధించి పట్టాలను మంజూరు చేయాలని కోరుతూ గిరిజనులతో సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసి బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు అన్ని రకాలుగా న్యాయం చేస్తామని ప్రకటనలు ప్రభుత్వం గుప్పిస్తున్నప్పటికీ ఆచరణలో కానరావడం లేదన్నారు. ఎన్నో ఏళ్లగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం నుంచి గిరిజనులకు ఎలాంటి ప్రోత్సాహకాలు కూడా అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతోపాటు జీఓ నెంబర్ 3ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ములగ, సంగంవలస, వెలగవలస తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, అధికారుల సమష్టి కృషి, సహకారంతో జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పార్వతీపురం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కె.అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 శాతం గిరిజనులు ఉండే ఈ ప్రాంతం పూర్తిగా పేదరికంతో కూడిన జిల్లా అన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలపై దృష్టి సారించడం కన్నా, స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయినప్పటికీ కనీస మౌలికవసతులులేని గ్రామాలపై దృష్టి సారిస్తే కొంత సార్థకత ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటికీ చాలా గ్రామాలకు రహదారి సదుపాయం లేదని, ఆరోగ్యం బాగాలేకపోతే డోలీ మోతలు తప్పకపోవడం విచారకరమన్నారు. త్వరలో అన్ని మండలాల్లో రోడ్లు సదుపాయం లేని గ్రామాలను గుర్తించి, రానున్న రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడమే తన ముందున్న ప్రధాన ధ్యేయమని చెప్పారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

రానున్న ఐదేళ్లలో ప్రధానమంత్రి సుజల యోజన పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీటి వసతి కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని త్వరలో జిల్లాలో అమలుచేస్తామని, ఇందులో భాగంగా రూ.140కోట్లతో ఆధునిక వ్యవసాయ పనిముట్లు రైతులకు పంపిణీ చేయనున్నామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ట్రైకార్ చైర్మన్ బొరగాం శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురామ్, పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, పార్వతీపురం మునిసిపల్ చైర్మన్ బి.విజయగౌరి, కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్‌వీ.మాధవరెడ్డి, జేసీ ఎస్.ఎస్. శోభిక, సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

విజయనగరం: విశాఖ జిల్లా గాజువాకలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విజయనగరం విద్యార్థులకు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కె.సంతోష్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశాఖ సిటీ, గాజువాక ఎ.ఆర్.కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఒకరోజు జరిగిన ఏపీ స్టేట్ ఇన్విటేషనల్ 18వ కెన్యూర్యూ, కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీలలో ఈ పతకాలు లభించినట్లు తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో బి.శివశ్రీ హర్ష కటాలో కాంస్యం, కుమిటీలో బంగారు పతకం సాధించగా.. కె.శివగణేష్‌కు కటాలో వెండి, కుమిటీలో బంగారు పతకాలు దక్కాయి. కె.మోహన్ చంద్రకు కటాలో వెండి, వి.హర్షవర్ధన్‌కు కటాలో కాంస్యం, కుమిటీలో వెండి పతకం లభించాయి. ఎస్. కార్తీక్ కటా, కుమిటీలో కాంస్య పతకాలు కైవశం చేసుకున్నాడు. కె.స్నేహ కటా, కుమిటీలో కాంస్యం, వి.చేతన్ శ్రీ నాయుడు కటా, కుమిటీలో కాంస్యం, వి.చేతన్ ఆనంద్ సుహాస్‌కు కటాలో కాంస్య పతకం లభించింది. ఎం.సాత్విక్‌కు కటాలో కాంస్యం లభించింది. జూనియర్స్ విభాగంలో' ఎల్.జశ్వంత్ కటా



సాధించిన పతకాలతో కరాటే క్రీడాకారులు

విభాగంలో కాంస్య పతకాన్ని సాధించాడు. కేడెట్ విభాగంలో ఎ.హేమంత్, కటా, కుమిటీలో బంగారు పతకాలు దక్కించుకున్నాడు. ఎం.హర్షవర్ధన్‌కు కటాలో బంగారు, కుమిటీలో కాంస్యపతకం లభించాయి. బి.షణ్ముక్ శ్రీకర్ కటాలో కాంస్యం, కుమిటీలో వెండి పతకం కై వశం చేసుకున్నాడు. బి.రేశ్వంత్ కటాలో కాంస్యం, కుమిటీలో వెండి పతకాన్ని సాధించాడు. ఆర్.గణేష్ కటాలో కాంస్య పతకాన్ని సాధించాడు. పతకాలు సాధించిన వారికి సంస్థ ఏపీ ప్రెసిడెంట్ కె. సుమన్, సెక్రటరీ ఆర్.ఢిల్లీశ్వరరావు, డిస్ట్రిక్ట్ సెక్రటరీ శివ కుమార్, కోచ్ కె. సంతోష్ కుమార్‌ల చేతుల మీదుగా పతకాలను, సర్టిఫికెట్లు అందజేశారు.

98 మద్యం బాటిల్స్ స్వాధీనం

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామంలో అనుమానస్పదంగా ఉన్న రెండు ఇళ్లల్లో సోదా చేసి 98 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సీతారాం తెలిపారు. ఒక ఇంటిలో 52మద్యం బాటిల్స్‌తో పాటు మద్యం అమ్మిన రూ.7,150నగదు స్వాధీనం చేసుకోగా, మరో ఇంటిలో 46 మద్యం సీసాలు దొరికాయని, విక్రయిస్తున్న వ్యక్తి తప్పించుకుని పారిపోయాడని ఎస్సై చెప్పారు. నిందితుడి కోసం గాలింపు చేపట్టడంతో పాటు కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థులకు గంజాయి విక్రయంపై ఫిర్యాదు

- తణిఖీ చేపట్టిన డీఈఓ, ఎస్సైలు

లక్కవరపుకోట: పాఠశాలల ప్రాంగణంలో విద్యార్థులకు గంజాయిని విక్రయిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు లక్కవరపు కోట మండల కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, ఎస్సై నీవస్‌పడాల్‌తో కలిసి సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ లక్కవరపుకోట మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణాల సమీపంలో గల షాపుల్లో విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నారని ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు.ఈ మేరకు ఆయా పాఠశాలల సమీపంలో గల పాన్‌షాపులను పూర్తిస్థాయిలో తనిఖీ చేశామన్నారు. ఈ షాపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్సైకి ఈ సందర్భంగా డీఈఓ సూచించారు. కాగా ఈ తనిఖీల్లో ఎలాంటి గంజాయి లభ్యం కాలేదు.ఈ షపుల్లో సిగరెట్లు, పాన్‌పరాగ్‌లు వంటి మత్తు పదార్థాలను విక్రయించ వద్దని షాపుల యజమానులకు ఎస్సై సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ సీహెచ్.కూర్మారావు,హెచ్‌సీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ సమీపంలో గల షాపులో తనిఖీ నిర్వహిస్తున్న డీఈఓ, ఎస్సైలు

వినతులకు వెంటనే పరిష్కారం

- లాగిన్‌లో పెండింగ్ ఉండరాదు
- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

విజయనగరం అర్బన్: ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే వినతులను లాగిన్‌లో అధికారులు ఎప్పటికప్పుడు చూడాలని ఇంకనూ చూడవలసిన కాలంలో ఎప్పుడు చూసినా సున్నా కనపడాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారుల వద్ద చూడకుండా ఉన్న వినతులు ఇంకా ఉన్నాయని, అవి ప్రతి సోమవారం సాయంత్రానికి సున్నాగా ఉండాలని సూచించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి కలెక్టర్ అంబేడ్కర్ 94 వినతులు స్వీకరించారు. అంతకు ముందు అధికారులతో మాట్లాడుతూ ప్రతి రోజు లాగిన్ అయి అధికారులు వినతులను చూడాలని అన్నిటిని వెంటనే పరిష్కరించి సరైన సమాధానాలు రాసి రీ ఓపెన్ కేసులు రాకుండా చూడాలని ఆదేశించారు. గంటగంటకు పీజీఆర్ఎస్ పెండింగ్ వివరాలను మానిటర్ చేయాలని డీఆర్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్‌తో పాటు జేసీ సేతు మాధవన్, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

కోర్టుల్లో ఫైల్ అయిన కేసులకు వెంటనే స్పందించాలి

హైకోర్టు, జిల్లా కోర్టుల్లో ఫైల్ అయిన కేసులను కోర్టు వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ తనిఖీ చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ అన్నారు. జిల్లాకు సంబంధించి రెవెన్యూ ఇతర శాఖలకు చెందిన కేసులేమైనా నమోదయ్యాయా? కోర్టు ఆర్డర్స్ పడ్డాయా అనే విషయాలను తనిఖీ చేసి వెంటనే నోడల్ అధికారి పంపించనున్నట్లు తెలిపారు. అలాగే సంబంధిత ప్రభుత్వ ప్లీడర్‌కు 24 గంటల్లో ఇన్‌స్ట్రక్షన్ పంపించి కాపీని తనకు పంపాలని కలెక్టర్ సూచించారు. కోర్టు ఆర్డర్స్ పడితే సంబంధిత అధికారులతో వెంటనే కౌంటర్ ఫైల్ చేసేలా చూడాలని కంటెంప్ట్‌కు అవకాశం ఇవ్వకూడదని కోరారు. ప్రతి శనివారం జిల్లా మొత్తం కేసుల వివరాలను తనకు సమర్పించాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో కలెక్టర్ అంబేడ్కర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఎస్పీకి 27 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి 27 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఎ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

పార్వతీపురంటౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 5 ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీతో పాటు, డీసీఆర్‌బీ సీఐ, వీసీసీఎం ఎర్రంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 31 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఏపీవో చిన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 31 వినతులు వచ్చాయి. ఓంద్రుజోలకు చెందిన సవర వెంకటరావు తమ పంట పొలాలకు సాగునీరు అందించేందుకు వీలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరారు. పులిపుట్టి, వెంపలగూడ, బూర్జమానుగూడకు చెందిన గిరిజనులు తమ భూములను సబ్‌డివిజన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. భరణికోట గ్రామానికి రోడ్డు నిర్మించాలని అక్కడి గిరిజనులు కోరారు. తామరగూడ, రెంగూడ, జన్నిగూడ, అల్తి గ్రామాలకు మినీ అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో డిప్యూటీఈవో నారాయుడు, సీడీపీవో రంగలక్ష్మి, హెచ్‌వో జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్



పార్వతీపురంటౌన్: సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అదనపు ఎస్పీ డా. ఒ.దిలీప్ కిరణ్



సీతంపేట: వినతులు స్వీకరిస్తున్న ఏపీవో

నాటి మాటలు.. నీటిమీద రాతలేనా..?

- మంత్రి సంధ్యారాణి తీరుపై గిరిజనుల విమర్శలు

సాలూరు రూరల్: 'మండలంలోని ఏజెన్సీలో ప్రభుత్వ పాఠశాలలు పాకల్లో నడుస్తున్నాయి. మేము అధికారంలోకి రాగానే పాఠశాలల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తాం' అని సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత గిరిజన, స్త్రీ శిశుసంక్షేమ శాఖమంత్రి సంధ్యారాణి ఊదరగొట్టిన ప్రగల్భాలు ప్రస్తుతం ఆమె పూర్తిగా మరిచిపోయారా? లేక ఆదమరిచారా? అన్న ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు అట్టహాసంగా నిర్వహించి కనీసం విద్యార్థుల తల్లులకు ఇచ్చిన తల్లికి వందనం హామీని నెరవేర్చలేదు సరికదా కనీసం విద్యార్థులకు సరైన వసతులు కల్పించే ఆలోచన కూడా చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విమర్శలు మీకు వర్తించవా?

మండలంలోని నిమ్మలపాడు గ్రామానికి ఎన్నికల ప్రచారం సందర్భంగా వచ్చిన ప్రస్తుత మంత్రి సంధ్యారాణి అక్కడ పాకలో నడుస్తున్న పాఠశాలను చూసి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు.జగన్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ నాశనమవుతోందని ఆరోపించారు. అయితే అప్పటికే జగన్ ప్రభుత్వం నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలలకు కొత్తభవనాలు, మౌలిక సదుపాయాలతో రెండు విడతల్లో పలు పాఠశాలల నిర్మాణాలు పూర్తిచేసింది. మరికొన్ని విడతల్లో మిగిలిన పాఠశాలలు అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని ఆరోపించిన మంత్రి సంధ్యారాణి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఆరోపణలు ఎవరికి వర్తిస్తాయో ఆలోచించాల్సిన అవసరం ఉందని ఏజెన్సీ గిరిజనులు విమర్శిస్తున్నారు.

రైలు రాకకోసం ఎదురుచూపులు

అలాగే సాలూరు పట్టణానికి రైలు వచ్చేస్తోందంటూ రెండు నెలల క్రితం ట్రయిల్ రన్ వేశారు. ఇప్పటికీ ఆ విషయంపై పట్టణ వాసులు ఎప్పుడు రైలు వస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మంత్రి సంధ్యారాణి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఉందని నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



నిమ్మలపాడులో పూరిపాకలో నడుస్తున్న పాఠశాల

తల్లిదండ్రులకు కళ్లకు కట్టిన నాడు-నేడు

నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలలు ఏమేరకు బాగుపడ్డాయో విద్యార్థులు, తల్లిదండ్రులకు మెగా పేరెంట్‌డే సమావేశంలో అర్థమైందని పలువురు చర్చించుకుంటున్నారు. ఏ పాఠశాలలో చూసినా నాడు నేడులో జరిగిన అభివృద్ధి తల్లిదండ్రులకు ప్రత్యక్షంగా కనిపించిందని చర్చించుకోవడం విశేషం.. కనీసం విద్యార్థులకు జగన్‌మోహన్ రెడ్డి అందించిన అమ్మఒడిని ఇవ్వలేని ప్రభుత్వం ప్రచారం కోసం డైవర్షన్ పాలిటిక్స్ విధానాన్ని అనుసరిస్తోందని, అందులోను స్థానిక మంత్రి ఏ సమావేశానికి వెళ్లినా పథకాల కోసం మాట్లాడకుండా నిత్యం జగన్ ప్రభుత్వం వల్లే రాష్ట్రం అప్పుల పాలైపోయిందని..ప్రస్తుతం చంద్రబాబునాయుడు సంపద సృష్టించే పనిలో ఉన్నారని చెబుతుంటే సమావేశాలకు వచ్చిన జనం మాత్రం సంక్షేమ పథకాలు ఇవ్వకుండా సంపద సృష్టిస్తున్నారా? అంటూ ఆమె వెనుకగా ఎద్దేవా చేయడం నియోజకవర్గంలో సర్వ సాధారణమైపోయింది. ఎన్నికల సమయంలో ఇది చేస్తాం అది చేస్తాం అంటూ మంత్రి సంధ్యారాణి హామీలు ఇచ్చి ఇప్పుడు ఆ హామీల విషయంలో కనీసం స్పందించడంలేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టుచెన్నూరు పంచాయతీ చెన్నూరు గ్రామం వెళ్లినప్పుడు ఈ గ్రామానికి రోడ్డు మంజూరు చేస్తామని బీరాలు పలికిన ఆమెకు ప్రస్తుతం ఆ విషయం గుర్తుందో లేదోనని ఆ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTRE

■ New Batch for All Competitive Exams on 16th December. Free Demos on 13th & 14th @ 2 to 5 pm. Surya Academy, Kota Jn., Vizianagaram. Cell: 99490 03295. [V-6621]

WANTED

■ ఉద్యోగ అవకాశము GOLDEN VENTURES, R&b రోడ్డు నందు పెయిడ్ బ్రాంచ్‌నందు పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను. టెలికాల్లింగ్, మార్కెటింగ్ ఆర్టిస్ట్-1, 18 నుండి 35 సంవత్సరం లోపు అనుభవం ఉన్న లేకున్నా ట్రైనింగ్ సదుపాయం కలదు. 10K to 35k మంచి జీతం, భోజనం,అలవెన్స్ కలదు.cell 7569325969, 9494438532 [S-1244354]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డ్సు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం: 12,000/-. సంప్ర:: 95507 45296 [V- 6615]

■ Universal యాడ్స్ కంపెనీకి మొబైల్‌లో SMSలు పంపుతూ వారానికి 5000 నుండి 6000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1253950]

■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNCకంపెనీలో వర్క్‌ఫ్రంహోం సదుపాయంతో స్త్రీ పురుషులు కావలెను. Qul-10th, డిగ్రీ మంచి జీతం ఉచిత రూముభోజనసదుపాయం.9019041491,9110475386 [G-9109]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135 [HA-99202]

■ MS Pvt Ltd నందు టెలికాలింగ్ చేయుటకు పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, మేల్/ ఫిమేల్ కావలెను. Qly: 10th, జీతం : 16000 to 18000, Ph: 7416297427/9550853907 [HA-970]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.